క్లుప్తంగా

బాలుడికి ఆర్థిక సాయం



బాలుడి బంధువులకు నగదు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ

శంఖవరం: తునికి చెందిన తొమ్మిదేళ్ల కొరెడ్డి నిఖిల్ అనారోగ్యంతో (బోన్ కాన్సర్) బాధపడుతుండగా విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. స్థానిక జెడ్పీహైస్కూల్లో పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు కలిసి రూ.14 వేలు నగదు బాలుడి కుటుంబ సభ్యులకు హెచ్ఎంయర్రపాటి సూర్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు.

ఎన్టీ రాజాపురంలో హోమం

గండేపల్లి: ఎన్టీ రాజాపురంలో ఇటీవల పునర్నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించనున్న లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మంగళవారం వేదపండితులు హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను జెడ్పీటీసీ పరిమి మంగతాయారు బాబు దంపతులచే జరిపించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పాల్గొని తిలకించారు.

వంద లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ఏలేశ్వరం: తిరుమాలి గ్రామంలో మంగళవారం చేసిన దాడిలో వందలీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్టు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు తన సిబ్బందితో తిరుమాలి శివారులో సారాబట్టిపై దాడి చేశామన్నారు. దాడిలో బెల్లపుఊట ధ్వంసం చేసి లోవరాజు అనే వ్యక్తి నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. లోవరాజుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్సై తెలిపారు. దాడిలో సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల భద్రతపై అవగాహన

గండేపల్లి: స్థానిక హైస్కూల్లో నేషనల్ హైవే అథారిటీ, సేఫ్వే ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రతపై వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం ఏవీఆర్ శర్మ, సేఫ్వే కంపెనీ సిబ్బంది ఎస్కే చాన్‌బాషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు పాండవులపాలెంలో 'గడపగడపకూ'

ప్రత్తిపాడు రూరల్: ఇ.గోకవరం గ్రామ సచివాలయం పరిధిలోని పాండవులపాలెం, పాదురుపాక గ్రామాల్లో బుధవారం సాయంత్రం రెండు గంటలకు స్థానిక ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

పాదయాత్ర విజయవంతం కావాలని పూజలు

గోకవరం: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ త్వరలో చేపట్టబోయే పాదయాత్ర విజయవంతం కావాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మంగళవారం తంటికొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నాయకులు పులువురు పాల్గొన్నారు.

జనసేన నాయకుల పూజలు

జగ్గంపేట: వారాహి ప్రజా సంక్షేమ యాత్ర విజయవంతం కావాలని జనసేన జిల్లా కార్యదర్శి బుదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాబోయే ఎన్నికలలో ప్రజల ఆశీస్సులు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు ఉండాలని కోరినట్టు శ్రీనివాస్ తెలిపారు.

సెంట్రల్ లైట్లకు మరమ్మతులు



బెండపూడి వద్ద లైట్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

తొండంగి: స్థానిక జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో నేషనల్ హైవే అథారిటీ అధికారులు ప్రధాన కూడళ్లలో సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు చేపట్టారు. తమ్మయ్యపేట, బెండపూడి, రావికంపాడు జంక్షన్, బెండపూడి వైజంక్షన్ వంటి ప్రధాన కూడళ్ల వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. దీర్ఘకాలం కావడంతో పలు చోట్ల లైట్లు సక్రమంగా వెలగడం లేదు. దీంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు హైవే అథారిటీ అధికారులు సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో ఎల్ఈడీ లైటింగ్ ఏర్పాటుతో హైవే జంక్షన్లు పండు వెన్నెలెలా దర్శనమిస్తున్నాయి.

ఆరుగురి అరెస్టు

జగ్గంపేట: బొమ్మ, బొరుసు ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్టు జగ్గంపేట ఏఎస్సై నూకరాజు తెలిపాడు. ఆయన కథనం ప్రకారం .. రామవరం శివారులో బొమ్మ, బొరుసు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.11,600, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై తెలిపారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- మండల పరిషత్ సమావేశంలో ప్రజాప్రతినిధులు
- మిగులు బడ్జెట్‌ను ఆమోదించిన సభ్యులు



తుని మండల పరిషత్ బడ్జెట్ వివరాలను వెల్లడిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ

తుని రూరల్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా స్థానిక మండల పరిషత్‌లో మిగులు బడ్జెట్‌ను ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మంగళవారం ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధ్యక్షతన 2022–23 ఆర్థిక సంవత్సర సవరణ, 2023–24 అంచనా బడ్జెట్ ప్రత్యేక, సాధారణ సర్వసభ్య సమావేశాలు జరిగాయి. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ సవరణ, అంచనా బడ్జెట్ వివరాలను, శాఖల వారి కేటాయింపులను సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ బోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, జెడ్పీటీసీ పోతల సూర్యమణి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామీణుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా ప్రగతిని సమీక్షించారు.

సాధారణ నిధి : 2022–23 ఆదాయంగా స్టాంపు డ్యూటీపై సుంకాలు రూ.44,56,146, సీనరేజి గ్రాంటుగా రూ.84,498, ప్రభుత్వం నుంచి తలసరి గ్రాంటుగా రూ.5,83,917ల వెరసి మొత్తం రూ.51,24,561లుగా పేర్కొన్నారు. వ్యయంగా మొత్తం నిధులలో మండలాభివృద్ధి పనులకు 23 శాతం, అత్యవసర మంచినీటి సౌకర్యాలకు 12శాతం, స్త్రీ శిశు సంక్షేమాభివృద్ధికి 15 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు ఆరు శాతం, కార్యనిర్వహణకు 15 శాతం, అత్యవసర కంటింజెంట్‌కు నాలుగు శాతం, అత్యవసర కార్యనిర్వాహక ఖర్చులకు పది శాతాన్ని కేటాయించారు. 2023–24 అంచన బడ్జెట్ కేటాయింపులు ఈ విధంగా ఉన్నాయి. మండలాభివృద్ధికి రూ.12,37,581, అత్యవసర మంచినీటి సదుపాయాలకు రూ.6,45,694, స్త్రీ, శిశు సంక్షేమానికి రూ.8,07,118, ఎస్సీ వర్గాల అభివృద్ధికి రూ.8,07,118, ఎస్టీలకు రూ.3,22,848, కార్యనిర్వహణకు రూ.8,07,118, అత్యవసర కంటింజెంట్లకు రూ.2,15,231, అత్యవసర కార్యనిర్వాహక ఖర్చులకు రూ.5,38,080 వెరసి రూ.23,80,788 అంచనాలు రూపొందించారు.

ట్రెజరీ ద్వారా : సామాజికాభివృద్ధి పద్దు కింద ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి ట్రెజరీ ద్వారా జీత భత్యాలకు రూ.1.89 కోట్లు, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాలు, ప్రయాణ ఖర్చులు రూ.9.42 లక్షలు చెల్లించనున్నట్టు తెలిపారు. ప్రాథమిక విద్యకు 2022–23లో రూ.25.50 కోట్లు, 2023–24లో రూ.30.50 కోట్లను ట్రెజరీ ద్వారా జీత భత్యాలు చెల్లించనున్నట్టు వివరించారు. మంచినీటి అవసరాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.రెండు లక్షలు, జాతీయ వృద్ధాప్య, అంగవైకల్యం తదితర పింఛన్లకు 2022–23లో రూ.35.34 కోట్లు, 2023–24లో రూ.43.34 కోట్లు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 2022–23లో రూ.19కోట్లు, 2023–24లో రూ.22కోట్లుగా పేర్కొన్నారు. సాధారణ నిధి, వివిధ పద్దుల కింద ట్రెజరీ ద్వారా మొత్తం ఆదాయం రూ.55,52,23,900, వ్యయం రూ.55,50,89,000, మిగులు రూ.1,34,900లుగా అంచనా వేసినట్టు అధికారులు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, తహసీల్దార్ బాలసుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎ.శివాజీ, పీఆర్ డీఈ శివాజీరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే..

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గండేపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం



గండేపల్లిలో వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

గండేపల్లి: గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గండేపల్లిలో రెండో రోజు మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, గ్రామ సర్పంచ్ రుత్తల లలిత, ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, సచివాలయాల మండల కన్వీనర్ తాళ్లూరు మధుకుమార్, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్ తదితరులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎందురుగా ఉన్న దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు జ్యోతుల రామస్వామి, తాళ్లూరి కృష్ణ, దాసరి ధన, మైలవరపు బుజ్జి, ఉప్పలపాడు సర్పంచ్ అడబాల ఆంజనేయులు, పార్టీ కార్యకర్తలు, ఎండీఓ రామన్, ఈఓపీఆర్డీ వీఎస్ఎస్ మూర్తి, తహసీల్దార్ చిన్నారావు, డీటీ సరిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బలక్ష్మి, హౌసింగ్ ఏఈ రాంబాబు, గండేపల్లి పంచాయితీ కార్యదర్శి సూర్యనారాయణ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కండి



తుని పట్టణంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీపీ సుధారాణి

తుని: పట్టణాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి కోరారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని 10వ వార్డులో కౌన్సిలర్ మొల్లేటి ప్రభావతి ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ.. మన బాధ్యత కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సుధారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందరికీ అందుతున్నాయని ప్రశ్నించారు. ప్రజలకు అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా ప్రతినిధులు తీసుకువచ్చిన సమస్యలపై అధికారులు స్పందించాలని ఆదేశించారు. తుని పట్టణ శాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

వైభవంగా ఒనుములమ్మ జాతర



పూజలందుకున్న ఒనుములమ్మ తల్లి

తుని రూరల్: డి.పోలవరం గ్రామ దేవత ఒనుములమ్మ అమ్మవారి జాతర మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే జాతర మహోత్సవానికి మంగళవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యే క ఏర్పాటు చేశారు. భక్తు లకు దర్శనాలు కల్పించి, తీర్థం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు సుభద్రయ్యమ్మపేట, కొలిమేరు, ఎన్.సూరవరం, ఎన్ఎస్‌పీ నగరం, అటికవానిపాలెం, టీజే నగరం, తుని, కుమ్మరిలోవ, తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఒనుములమ్మ అమ్మవారిని దర్శించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా కళాకారులచే వివిధ వేషధారణలు, బుర్రకథ, తీన్‌మార్ కాంగో నృత్యాలు, డి.పోలవరం, జగన్నాథగిరి, కొత్త వెలంపేట, వి.కొత్తూరు బృందాలచే కోలాటాలు ప్రదర్శించారు. రూరల్ సీఐ ఎ.సన్యాసిరావు, ఎస్సై ఎ.బాలాజీ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గ్రామ సచివాలయం పరిశీలన



ఇందుగపల్లి సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: ఇందుగపల్లి గ్రామ సచివాలయాన్ని ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయ పరిసరాలు, రికార్డులు, సిబ్బంది ఆన్‌లైన్ హాజరు పరిశీలించి పలు సూచినలు చేశారు. రోజూ సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకూ నిర్వహించే స్పందన కార్యక్రమంలో సిబ్బందంతా విధిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇంటి పన్ను వసూలు, చెత్త నుంచి సంపద కేంద్రం నిర్వహణ, సంక్షేమ పథకాల అమలుపై సంబంధిత సిబ్బందితో చర్చించారు. చెత్త నుంచి సంపద కేంద్రాన్ని సందర్శించి అక్కడ నిర్మించిన సామూహిక మరుగుదొడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం టీజే నగరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని సందర్శించి వినియోగదారులకు అందిస్తున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే అచ్చిరాజు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్లతో ఇక్కట్లు



కత్తిపూడి రహదారిపై నిలిపిన వాహనాలు



కత్తిపూడి కాంప్లెక్స్ వద్ద రద్దీగా ఉన్న రహదారి

- రోడ్లపై వాహనాల నిలిపివేత
- తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం
- రాకపోకలకు ప్రజల ఇబ్బంది

శంఖవరం: హైవేలకు అనుసంధానంగా ఉండే రహదారులు ఇరుకుగా ఉండడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడంలేదు. తరచూ ట్రాఫిక్ సమస్యతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన జంక్షన్ల వద్ద ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. మండలంలో కత్తిపూడి నాలుగు కూడళ్ల ప్రధాన జంక్షన్‌లో ఇటు శంఖవరం వెళ్లే రోడ్డు, అటు కాకినాడ, మరో వైపు రాజమండ్రి, తుని రోడ్లు ఎప్పుడూ రద్దీగా ఉంటాయి. ఈ రోడ్లలతో నింబంధనలకు విరుద్ధంగా ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఆటోలు, బైక్‌లు, చిరు వ్యాపారుల బండ్లు రోడ్డుపైనే నిలిపివేయడంతో జనం నడవడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యాపారులు, ప్రయాణికులు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక అవస్థలు పడుతున్నారు. కత్తిపూడి మీదుగా వెళ్లే 216 రహదారి, 16 నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. కానీ సమస్య యథావిధిగా మారింది. హైవే రోడ్డు, దాని నుంచి గ్రామాలకు అనుసంధానంగా ఉండే రోడ్లను వెడల్పు చేసి, ఆక్రమణల తొలగించి, వాహనాలు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిత్యం ట్రాఫిక్ సమస్య



కత్తిపూడి అన్ని గ్రామాలకు ముఖ్య కూడలి. నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీనివల్ల ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ప్రధాన రహదారిపై వాహనాలు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలి. కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు, స్టిక్కర్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి. అధికారులు, పోలీసులు స్పందించాలి.

–కొల్లు వెంకట రమణ, ఆటోడ్రైవర్, జి.కొత్తపల్లి

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఎంపీపీ అంగులూరి అరుణ్‌కుమార్
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అరుణ్‌కుమార్

తొండంగి: గ్రామీణ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సాధారణ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ఈ పథకాలు ప్రజలకు చేరువ చేసేందుకు ఉన్నత స్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అనంతరం విద్య, వైద్యం, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పలు సమస్యలను సభలో ప్రస్తావించగా వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వైస్ ఎంపీపీ నాగం గంగబాబు మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న జగనన్న పాలవెల్లువ కార్యక్రమానికి గ్రామస్థాయిలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు బాధ్యతగా తీసుకుని పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులతో బెండపూడి స్కూల్ రోడ్డు రూ.20లక్షలతో నిర్మించామని, పైడికొండలో రూ.15లక్షలతో రెండు సీసీ రోడ్లు ప్రతిపాదనలు పంపామన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కృషితో రూ.2 కోట్లు, జిల్లా పరిషత్ నిధులతో పి.ఇ.చిన్నాయపాలెం, ఎ.కొత్తపల్లి, సీతారాంపురం గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మాణానికి, మరో కోటి రూపాయలు తుని మండలానికి అభివృద్ధికి నిధులు కేటాయించి ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పసపులేటి సతీష్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దూళ్లిపూడి ఆంజనేయులు, ఈవోపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, ఎంఈఓ షేక్‌బాబ్జి, పంచాయతీ కార్యదర్శులు వాడ్రేవు చక్రవర్తి, రాజబాబు, ప్రేమ్‌కుమార్, గంపల రాము, చోడిశెట్టి అప్పారావు, సవరం చంద్రశేఖర్, బి.రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

పేదల ఇంట సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- ఏలేశ్వరంలో గడపగడపకూ మన ప్రభుత్వం



ఏలేశ్వరంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: పేదలను ఆదుకునేందుకే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. పట్టణంలోని చైతన్యనగర్‌లో మంగళవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నామన్నారు. అవినీతికి తావులేదన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యతమిస్తామన్నారు. ప్రభుత్వం అన్నివర్గాలకు న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి, కౌన్సిలర్ యండగండి నాగబాబు, తొండారపు రాంబాబు, మసిరపు నాగేశ్వరరావు, వాగు బలరామ్, జువ్విన వీర్రాజు, సిరిపరపు రాజేష్, వాడపల్లి శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

ఏలేశ్వరం: పట్టణంలో గురువారం ప్లాస్టిక్ వస్తువులు వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో 75 మైక్రోన్స్‌కన్న తక్కువ ప్లాస్టిక్ వాడరాదన్నారు. ప్రభుత్వ గడువు తీరడంతో ఈనెల 26 నుంచి ఫ్లెక్సీలు వాడడం నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ వాడితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంకు సేవా పురస్కారం



అవార్డు అందుకుంటున్న ఏఎన్ఎం చిన్నమ్ములు

ఏలేశ్వరం: జాతీయ బాలిక సంరక్షణదినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన ఏఎన్ఎం మర్రి చిన్నమ్ములు జిల్లా ఉత్తమ సేవా పురస్కారం అందుకుంది. బాలికా శిశుసంరక్షణ, గర్భస్థ పిండ నిర్ధారణ చట్టంపై అవగాహన వంటి సేవలకు గాను కాకినాడలో జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా చేతులమీదుగా మంగళవారం అవార్డు అందుకుంది. పట్టణంలో అర్బన్ పీహెచ్‌సీ పరిధిలో పని చేస్తున్న చిన్నమ్ములును అధికారులు, తోటి సిబ్బంది అభినందించారు. అలాగే ఉత్తమ సేవలు అందిస్తున్న ఆరోగ్యవిస్తరణాధికారి భాస్కరరావును కూడా జిల్లా అధికారులు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శాంతిప్రభ, ఆరోగ్యసేవల ప్రాంతీయ సంచాలకులు పద్మశశిధర్, పెద్దాపురం డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సరిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం



ధర్మవరంలో అవగాహన ర్యాలీ



వివిధ వేషధారణల్లో గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు



రాజపూడిలో ర్యాలీ

- వివిధ వేషధాణల్లో అలరించిన గిరిజన బాలికలు

తుని రూరల్: వి.కొత్తూరులో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. బుధవారం ప్రిన్సిపాల్ అమృతవాణి ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించి, ప్రతిభకనబర్చిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. తాము అన్నిరంగాల్లో ప్రతిభ, నైపుణ్యాన్ని ప్రదర్శించగలమన్న సందేశాత్మక వేషధారణలతో విద్యార్థినులను అలరించారు. న్యాయవాది, ఉపాధ్యాయురాలు, డాక్టర్, ఇంజినీర్, గృహిణి వంటి వేషాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అమృతవాణి మాట్లాడు తూ బాలికల గొప్పతనాన్ని, పురుషలతో సమానంగా అవకాశాలను అందిపుచ్చుకుంటున్న మహిళల సామర్థ్యాన్ని కొనియాడారు. అన్నిరంగాలలో ముందడుగు వేస్తున్న బాలికలను ప్రభుత్వం ప్రోత్సహిస్తు అండగా నిలుస్తుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ధర్మవరంలో..

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం మంగయ్యమ్మ పేట ప్రభుత్వ పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా బాలికలకు విద్య ఆవశ్యకత, పోషకాహారం సమస్యలపై విద్యార్థులు కళా ప్రదర్శన ఇచ్చారు. ఉన్నత చదువులు చదువుకొని వివిధ రంగాల్లో బాలికలు రాణించాలని హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయుని దేవి వరలక్ష్మీ ఉద్బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల విద్యకు అధిక ప్రాధాన్యతం

ప్రత్తిపాడు రూరల్: బాలికలు విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామ సచివాలయ మహిళా పోలీసులు చాందిని, రాధా, ముక్తారి అన్నారు. ధర్మవరంలో గ్రామ సచివాలయ మహిళా పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులతో కలిసి అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల హక్కులు, వారికి కల్పించాల్సిన రక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో 14 అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజపూడిలో..

జగ్గంపేట: రాజపూడి సచివాలయంలో ఐసీడీఎస్ కాట్రావులపల్లి సెక్టార్ సూపర్ వైజర్ సునీత ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం ఘనంగా మంగళవారం జరిగింది. గ్రామంలో బాలికలతో ర్యాలీ నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూసాల విష్ణు, సచివాలయ సెక్రటరీ నర్సింహమూర్తి, ఖాదర్, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్త్ సిబ్బంది, ఉపాధ్యాయులు, వలంటీర్లు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రనాయుడు ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం నిర్వహించారు. అభివృద్ధి కమిటీ చైర్మన్ ఒమ్మి రఘురాం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే కేంద్రం ఆకస్మిక తనిఖీ

గండేపల్లి: ఉప్పలపాడులో రైతు భరోసా కేంద్రాన్ని(ఆర్‌బీకే) విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు సంపూర్ణ సమాచారం అందించే కియోస్క్ మెషీన్ పనితీరు, ఈ–క్రాప్ నమోదు చేసే విధానం, ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న పథకాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరా అమలు తీరు తదితర వాటిని పరిశీలించారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్టు ఎస్పీ పీవీ రవికుమార్ తెలియజేశారు. విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ ఎస్‌బీ బాగ్చి ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తనిఖీల్లో డీఎస్పీ పి.ముత్యాలనాయుడు, ఇన్‌స్పెక్టర్లు సత్యకిషోర్, శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారి భార్గవ మహేష్, తహసీల్దార్ విజయకుమార్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుళ్లు ఉన్నారు.

గోకవరం: కృష్ణునిపాలెం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రాజమహేంద్రవరం యూనిట్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కేంద్రంలో ఉన్న కియోస్క్ మెషీన్ పనితీరు, ఈ క్రాప్ నమోదు తదితర వాటిని పరిశీలించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని విజిలెన్స్ అధికారులు తెలపారు.